# షికార్

ఓపెన్ సెసేమ్....!

ఈ మూసిన తలుపులు ఇంకో సెకండ్‌లో తెరుచుకోవాలి. ఆ తలుపు వెనకాల పలకరింపుతో నవ్వే పెదవులుంటే ఎంత బావుండును. మంచి నీళ్ళ కోసం గొంతెండుకుపోతోంది. ఇచ్చేందుకు వాళ్ళెందుకు సందేహిస్తారో తలుచుకొంటే చేతిలో బుట్ట బరువై.... బరువై....

తలుపవతలి భద్ర మహిళ దృష్టిలో తనలాటి సేల్స్ గరల్స్ ఏపాటి?

తను లూటీలు చేసినా చెయొచ్చు. మోసాలకు దిగవచ్చు. వాళ్ళ ఇళ్ళల్లో మొగవాళ్ళకు వల విసరవచ్చు. తన చూపుల గాలాల కొక్కేలకు తగులుకోని వస్తువు ఉండకపోవచ్చు.

అంచేత ఏ ప్రమాదమూ లేకుండా తమ ఇంటి గుమ్మాన్ని ఏ అనాచారమూ తొక్కకుండా తనను తలుపవతలనుంచి తేలికగా తిరస్కరించటం సులువు కదా!

'ఈ అవమానం నిన్ను దహించివేయదా?' అంటూ ఎవరేనా మూర్ఛలుపోతే అమితాశ్చర్యంగా వుంటుంది. కాదా మరి....' అవసరం ఒక నొప్పి తెలియనివ్వని ఎనస్తీషియా. ఇంజక్షన్ ఇవ్వగానే కళ్ళూ, మనసూ, మెదడూ అన్నీ చైతన్యం పోగొట్టుకొని, మనిషి లక్షణాలన్నీ కనుమరుగైపోయినప్పుడు కాల్చే ఆకలి ఒక్కటే వామనుడు విశ్వం రూపం ధరించినట్లు జీవితం మొత్తం విస్తరించేసి గుప్పిట్లోకి రాలే పైసల గురించి ఆలోచన ఒక్కటే సజీవంగా మిగిలితే....

.....నేనో సేల్స్ గరల్ని!

నన్ను చూస్తే నాకు భలే తమాషా. రంగులు మార్చే వర్ణచిత్రంలాగా ఎదుట తలుపు తెరుచుకోగానే పెదవులపైన ఒక వినయపు నవ్వు చంద్రకిరణ స్పర్శ సోకిన కలువ మొగ్గ వికసించినట్లు.... సన్నజాజి చిన్నగా నవ్వినట్లు అలా తలుపులు తెరుస్తూ.... మూస్తూ వుండగానే మెరుస్తూ, వెలుస్తూ ఎంత తేలికగా రంగులు మార్చుకోగలనో తలుచుకుంటే నవ్వులోంచి దుఃఖంలోకి పరకాయ ప్రవేశం చేసినట్లే కదా...! చిన్నప్పుడు చూసిన బయోస్కోప్ గుర్తుకొస్తోంది.

'కాశీపట్నం చూడర బాబూ....'

కాసినిచెట్లూ, ఎత్తయిన మేడలూ, గుళ్ళూ, గోపురాలూ అంత బుల్లి పెట్టెలో ఎలా దాక్కున్నాయో...? తెలియని పిల్లల కోసం ఒక అద్భుత మాయాలోకం. కాసిన్ని కత్తిరించిన ఫిలిం ముక్కలతో ఆ జానెడు పెట్టెలో సృష్టించారని తెలియకపోవటం ఎంత సుఖం. ఏదీ లేని చోట, ఏదీ దొరకని చోట ఏదో వుందనే ఊహ ఎంత ఊరట! అలాంటి అమాయకత్వానికి రోజులు చెల్లిపోయి, నిష్ఠుర నిజమేదో, పట్టని... ....చీల్చినట్టుగా, తెలిసిపోయాక ఇప్పుడిహ ఈ రెండు కళ్ళు, ముక్కు, నోరున్న కాస్త మొహంలోనే సవాలక్ష రంగులు ఆవిష్కరించగలను..

ఇంకా తలుపులు తెరుచుకోనే లేదు. బెల్ నొక్కితే బావుంటుందో? లేదో? నిద్రపోతున్నారేమో? పోనీ వెనక్కి తిరిగిపోదామంటే ఆ ఇంట్లోంచి అన్నపూర్ణ గ్లాసెడు నీళ్ళిచ్చి కాసిన్ని బిస్కట్లు కొంటుందేమోనని కొడిగట్టిన దీపం ఆఖరిసారి మినుకు మినుకుమని వెలిగే ఆశ....

అల్ల మామిడి చెట్టు నీడ కింద... ఎత్తరుగుల ఇంటి ఇల్లాలు వెండి గిన్నెలో చిన్న పాపాయికి కబుర్లు చెపుతూ అన్నం తినిపిస్తోంది. ఒక్క నిమిషం గుండెలు ఉప్పొంగాయి. చనుబాల చెమ్మతో గుండె దగ్గర కాస్తంత తడి. అబ్బ ఈ గుండెలన్నీ

పాల వెల్లువతో నిండిపోయి నా చిట్టి తండ్రి బొజ్జ నిండుగా రాకూడదా... కడుపునిండుగా తిండి వుంటే, రొమ్ము నిండుగా పాలుంటాయి...ప్రాప్తం లేదంతే అనుకొంటూ నేలమీద దేకురులాడే అమ్మ నా బుల్లి కన్న నోట్లో పల్చని గంజినీళ్ళు వంచుతూ ఎన్నిసార్లు నిట్టూరుస్తుందో? అబ్బ ఆ నిట్టూర్పుల సెగేనా. ఈ మండిపోయే ఎండల వడేనా.... నా పెదవులు ఎండిపోతున్నాయి గుక్కెడు చల్లని నీళ్ళ కోసం....

ఉదయాన్నే నా బుట్ట సర్దుకొంటుంటే నా బుల్లి పిల్లాడు అడ్డాలడ్డాలు వస్తాడు. వాడికి ఇంకా రెండేళ్ళు రానేలేదు. నోట్లో వేలేసుకొని నల్లని కళ్ళతోనే సర్దుకొనే బిస్కట్ల వైపు రాగములకల్లాగా కళ్ళు తిప్పుతూ చూస్తుంటే.

వద్దు తండ్రీ వద్దు.... తియ్యతియ్యని రుచులు నీకిప్పుడప్పుడే వద్దు తండ్రీ వద్దు. ఈ రుచులు అందని వేదన వుందే అది కాలకూట విషం నాన్నా, అమ్మ ఒడి హాయి తప్ప, పెట్టీపెట్టని మెతుకులు తప్ప ఇంకో ఆనందం నీకిప్పుడప్పుడే వద్దు తండ్రీ వద్దని వాడిని వారిస్తూ. 'మా బతుకుల్లో రుచిని' ఎందుకు లేకుండా చేశావు తండ్రీ' అంటూ ఆ పరమాత్ముడిని మా గోడు వినిపించుకోమని, చేతులు జాపి కోరుకొంటుంటే. ఆ జాపిన చేతులు తనకేమోనని కోవెల మెట్లెక్కినట్టు నా పాపాయి నా కుచ్చిళ్ళ పైనుంచి గుండెలపైకి జారి ఆ బుల్లి పెదవుల్లోంచి కమ్మకమ్మగా 'అమ్మ' అని పిలిస్తే అప్పుడు అర్థం అయింది విశ్వ విభుడి చమత్కారం. పొట్లాల్లోని తీయతీయని రుచులను మించిన కమ్మదనం నా బుల్లి తండ్రి మెడచుట్టిన చేతుల్లో నింపావా తండ్రీ! పెదవులు బిగించి ఈ తియ్యని కన్నీటి సముద్రాన్ని కొత్తశక్తిని కూర్చుకొంటూ ఈదాలనిపిస్తుంది....

ఉదయాన నిద్రలో కూరుకుపోతున్న నా చిన్ని తండ్రి కళ్ళని చల్లని నీళ్ళతో కడిగి తుడుస్తూ, ఆకలెరుగని నిద్రలో వున్న వాడి ఆ సుఖాన్ని బలవంతంగా పెళ్ళగించేస్తూ 'తిను తండ్రీ, ఈ పప్పన్నం తినరా బాబూ' అమ్మ వెళ్ళిపోతోంది. 'బిస్కట్లు కొనండి' బాబూ అంటూ వేడుకోను వెళ్ళిపోతోంది. మరిప్పుడు 'నువు తొందరగా తినలేకపోతే ఎలాగరా కన్నా' అంటూ ఆవేళగాని, వేళకు వాడి పొట్టలోకి పప్పన్నం కూరాలని కూతురు పడే ఆరాటాన్ని చూసేది నేలమీద పారాడే అమ్మ మాత్రమే.

సాయంకాలం వరకూ వాడికి ఆకలి కానీకు దేవుడా అంటూ మనసులో పొర్లు దండాలు పెట్టేస్తోంటే సుప్రభాత సేవకి అప్పుడే నిద్ర లేచి, పరగడుపునే పక్కలోంచి లేచిపోయి, మెట్లు దిగిపోయిన కాసులతల్లి గుండెలమీద వదలిన చందనపు పరిమళాలను, రాత్రి తాలూకూ తీయని జ్ఞాపకాలనూ మైమరచి తలుచుకొంటూ కళ్ళు

నులుముకొంటున్న లక్ష్మీ వల్లభుడికి వినపడే వుంటాయా?

దేవుడు వాడికి వేళ్ళలోంచి అమృతం ఇస్తాడే అంటుంది అమ్మ. ఎర్రెర్రని బుల్లి పెదవుల నా అల్లరి కన్న ఎప్పుడూ నోట్లో వేలు తీయనే తీయడు. తీరుగా లేని జీవితంతో కుస్తీ పట్టీ పట్టీ శ్రమించిన కాళ్ళు ఇంకెప్పటికీ పని చేయలేమని మొరాయిస్తే పసిపాపలా నేలమీద పారాడుతూ ప్రాణాలతో ఉన్న అమ్మకు పరమాత్ముడి పట్ల ఎందుకో విశ్వాసం.

ఆవిడనో ఏడుపునవ్వులతో పరామర్శించి అదెట్లానమ్మా, ఆకలికి ప్రాణం కడబట్టిపోతున్నా, వాడు రాని ఆహారం కోసం వేళ్ళు చీకుతూనే వుంటాడని చెప్పాలనిపించిన అమ్మ మనస్సుని నిలువెత్తు గోతిలో కప్పిపెట్టేసి నేలమీద పారాడే ఆ ఇద్దరినీ ఆ పరమాత్ముడికి ఒక్క నమస్కారంతో అప్పగించేసి,

'బిస్కట్లూ, బిళ్ళలూ' అంటూ వీధిన పడితే ఈ తలుపులు తెరుచుకోవేం?...!

అసలు మూసిన తలుపులంటే నాకెందుకో భయం. మొదట ఈ తలుపుల వెనకే వొళ్ళంతా కోరలున్న ఓ అందమైన పాము నొప్పి తెలియని కాటు వేస్తే అది తీయని బాధలా అనిపించింది తప్ప విషం ఎక్కుతుందని తెలియలే. అమ్మ పాపం సంవత్సరాల తరబడి నెత్తురోడ్చిన ఆ కాసిని పైసలు ఆ పామే కట్నంగా పుచ్చుకొని నా మెళ్ళో, రూపాయి మించని పసుపుతాడు మాత్రం గట్టిగా కట్టేసి నన్ను పెళ్ళాన్నీ, తల్లినీ చేసిన ఆ కోరల పాముకి మా వెనక వీధిలో, ముందువాడలో ఇంకా ఎక్కడెక్కడో వేసిన ఈ తాళ్ళకి వేలాడుతూ నాలాటి భార్యలున్నారని తెలిశాక కూడా, ఇహంలో ఆ దేవుడి చేత, నోరెత్తితే తన్నిన తన్నులు కిక్కురుమనకుండా తినేస్తూ, కనిపించని పైవాడిని కొలిచీ కొలిచీ అలిశాక ఆ మచ్చల పాము ఎప్పటికో నన్ను కరుణించి విడుదల చేస్తే అప్పుడెప్పుడో ఆగిపోయిన ఊపిరి మళ్ళా ఈ ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం ఉద్యోగం సంపాదించాక తిరిగొచ్చింది. ఇక తియ్ లెక్కలు... వెయ్ కూడికలు. నేర్చుకున్న పాఠాలెన్నో, సందేహం లాటి జీవితంలో పొందిన అనుభవాలెన్నీ?

అమ్మయ్య తలుపులు తెరుచుకొన్నాయి. ఒక అనుమానపు చూపు. ఒక సందేహం ఇలాటి వాళ్ళే దొంగలమ్మా....! వీళ్ళకి దొంగలతో కాంటాక్ట్లమ్మా' అన్న భయపు చూపు. 'చుక్క నీళ్ళిమ్మని అడిగినా.... ఆ వంకని ఈ ఇల్లంతా చుట్టబెట్టుకు వెళ్ళిపోతాననే సంశయం! ఒక్క రెప్పపాటులో భాష లేని ఇన్ని భావరాగ సమ్మేళనాలు ఉప్పెనలా విరుచుకు పడితే. కళ్ళలోంచి గంగ ఎగిరి దూకేది......... ఆవిడ కరుణాంతరంగాన్ని కనిపెట్టే మూడు కళ్ళున్న బూదిలింగడు జటాజూటాల ఆవిడ్ని

పట్టి బంధించాడు గనుక సరిపోయె! అయినా పగుళ్ళిచ్చిన ఈ గుప్పెడు గుండెకు తెలియదు కనుకనా! ఇంతకింతకు ముందే. అల్లా పచ్చపచ్చని చెట్ల గుబుర్ల నీడలలోని ఎత్తు గుమ్మాల తలుపులు బార్లా తెరచిందో ఇల్లాలు! ఇంట్లోకెళ్ళి చల్లని నీళ్ళు తెచ్చి ఇస్తాననీ కదిలింది. అటునుంచి నిముషంలో ఇంటి యజమాని దయావర్షం కూడా అడక్కుండానే కురిస్తే ఆగ్రహించిన ఆ అమ్మ కురిపించినవి అవి పిడుగులా... మాటలా! కాకపోతే అయ్య పాతివ్రత్యం పట్ల అమ్మకెంత గౌరవమో...

"కాస్త మెత్తమెత్తని మనసూ.... పాపం ఆయనదేం తప్పని. అడక్కుండానే అన్నీ ఇవ్వగలిగే ఆయన మనసు పాపం అసలే వెన్న...! అంటూ ఆ వెన్నని తాను కరిగించలేని దౌర్భాగ్యం గురించి తలుచుకోకుండా సేల్స్‌గరల్ అంతరంగాన్ని అంచనా వేసే ఆ భద్ర మహిళ సౌజన్యం...!

ఇక చుక్క నీళ్ళందుకున్నా చిగురించి తీరతానని ఎడారి మనసులోంచి పెదాల మీదకు అలవోకగా చిరునవ్వు జారి ఇంకో తలుపు తడితే...!

మా ఆవిడ బజారుకెళ్ళింది. పోనీ కాస్సేపు చల్లగా రెస్ట్ తీసుకోరాదా.. మా ఇంట్లో ఫ్రిజ్‌లో చల్లని నీళ్ళున్నాయి. ఎత్తెత్తు మంచాలున్నాయి. మెత్తమెత్తని పరుపులున్నాయి. అందులోకి కోరికల దుప్పటి పరచి స్వాగతం పలుకుతున్నా... బయట అస్సలే ఎర్రని ఎండ...! అంటూ ద్వారాలు తెరిచిన అయ్యగారి ఆ విశాలహృదయానికి జోహార్లు పలికి మెట్లు దిగుతుంటే.

మొగ్గపూవయినంత నిశ్శబ్దంగా మొహంలో వికాసం మాయమైపోతుందే...?

ఇలాగా...

ఇంకెన్నాళ్ళూ... ఎన్నేళ్ళూ... అంటూ పిరికిగుండె ఆయాసపడుతుంది. కానీ ఇది జీవితం గాదూ.... వళ్ళంతా చుట్టిన కోరల పాము నోట్లోంచి బయటకు జారిన బతుకు కాదూ. చిక్కని చీకటిలోంచి మెల్లమెల్లగా వెలుగు రావటమంత నిజం కాదూ..

ఎన్నెన్ని అనుభవాలకు పదునెక్కి పదునెక్కి వర్షించి, వర్షించి ఇక నెమ్మదిగా మారే రుతువులకు జీవితం అలవాటు పడితే ఇంకేం ఇకనేం కష్టం కాకపోతే వర్షాలకు తడుస్తూ, తడుస్తూ చిత్తడిగా మిగిలిన జీవితంలోంచి జీవం పోసుకొని పెదవుల జారేదొక్కటి...

బిస్కట్లు కావాలమ్మా... పిల్లలకీ, పెద్దలకీ, ఇదే జీవనాడీ... జీవ రహస్యమూనూ!! ✳

*'ఆంధ్రజ్యోతి' ఆదివారం 23 ఏప్రిల్ 2000*